క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి విశేష పూజలు



స్వామి వారికి హారతిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నెలో బుధవారం అయ్యప్ప స్వామికి మాలాధారులు విశేష పూజలు చేపట్టారు. ఆళ్లగడ్డ మండలం పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి స్వగృహంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. దీంతో గ్రామంతో పాటు పక్క గ్రామాల్లోని అయ్యప్ప మాలాధారులు అధిక సంఖ్య లో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు గురురాజ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు స్థానిక మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రోబాల్ అండర్-14 విభాగంలో అక్షయ జ్యోతి, మణికంఠ, అండర్-17 పోటీల్లో పాండురంగ జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను మెడల్స్, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

170 ట్యాబ్‌ల మంజూరు

శిరివెళ్ల: మండలానికి 170 ట్యాబ్‌లు మంజూరయ్యాయని ఎంఈఓ శంకరప్రసాదు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు ట్యాబ్‌లను అందచేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు 110, వీరారెడ్డిపల్లె 27, చెన్నూరు 16, ఇసుకపల్లెకు 17 ట్యాబ్‌లు మంజూరయ్యాయని చెప్పారు. 8వ తరగతి విద్యార్థులకు ఈ నెల 21న పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 నాగార్జునరెడ్డి, సీఆర్పీలు అన్సర్, గుర్రప్ప, పుల్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నంద్యాల(సిటీ): పట్టణంలోని గిరినాథ్ సెంటర్‌లో రూ.23లక్షలతో సీసీ డ్రైన్, 12వ వార్డు బాలాజీ కాంప్లెక్స్‌లో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా బుధవారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

గోస్పాడు: వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయాలని యూఎన్‌డీపీ రాష్ట్ర ప్రతినిధులు మధుకర్, శివశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని పసురపాడు, జూలేపల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

పటిష్టంగా 'కుష్టు' సర్వే

నంద్యాల: జిల్లాలో కుష్టు వ్యాధి అనుమానిత కేసుల గుర్తింపునకు ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో కుష్టు వ్యాధి అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న సర్వేను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. జనవరి నుంచి జిల్లాలో ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సర్వే అడ్డు రాకుండా చూడాలన్నారు. జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శారదా బాయి, డీఎస్‌ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సునీత, డాక్టర్ కాంతారావు నాయక్, పారా మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



బహుమతులు అందజేస్తున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిప్యూటీ డీఈఓ మహబూబ్ బేగ్ అధ్యక్షతన కౌశల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన పాఠశాల గ్రూపును రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. అలాగే పోస్టర్ ప్రదర్శనలో ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. క్విజ్‌లో రాష్ట్రస్థాయికి రెండు పాఠశాలలను ఎంపిక చేసినట్లు పరిశీలకులు కుమార్ బాబు తెలిపారు. విజేతలను ఇంజినీరింగ్ కళాశాల అధినేత వెంకటరామిరెడ్డి, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, ఎంఈఓ బ్రహ్మం, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, కౌశల్ జాయింట్ కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్, జిల్లా ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి అభినందించారు.

పాఠశాలల అభివృద్ధికి యుడైజ్ ప్లస్

- వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ
- సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు
- వాటి ఆధారంగా 2024-25 సమగ్ర శిక్ష బడ్జెట్ రూపకల్పన
- మండలంలో 34 పాఠశాలల్లో ఆన్‌లైన్
- క్షేత్రస్థాయి ఆన్‌లైన్‌కు నేటితో గడువు పూర్తి



యుడైజ్ ప్లస్ లోగో

గోస్పాడు: పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పనలో విద్యాశాఖ నిమగ్నమైంది. యుడైజ్‌లో పొందుపరిచిన సమాచారం ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలకు ఏటా రూపొందిస్తున్న ప్రణాళికలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి. ఇందులో భాగంగానే యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగానే 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి, మండల సమగ్ర శిక్ష బడ్జెట్ రూపొందిస్తారు.

సమగ్ర సమాచారంతోనే ప్రయోజనం..

సాధారణంగా ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక అవసరాలకు నిధులు కేటాయిస్తారు. పాఠశాలల నుంచి వచ్చే సమాచారం మేరకే నిధులు కేటాయించేందుకు ప్రాతిపదికగా నిలుస్తుంది. మండలంలో 1-10వ తరగతి వరకు 32 పాఠశాలల్లో 3,800 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే మండలంలోని రెండు జూనియర్ కళాశాలల్లో 495 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమాచారాన్ని కూడా అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కావాలన్నా, ఉన్న పోస్టులకు రేషనలైజేషన్ చేయాలన్నా, నూతనంగా అదనపు తరగతి గదులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ర్యాంపులు, వంటగదులు, లేబరేటరీలు, ప్రత్యేకావసరాలు గల చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు వంటివి మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యుడైస్ ప్లస్ సమాచారం ఆధారంగా ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి.

గతంలో మాన్యువల్‌గా..

మండలంలోని అన్ని పాఠశాలలు యుడైస్ ప్లస్‌లో సమాచారాన్ని పొందుపర్చేందుకు ఈ నెల 21వ తేదీ వరకు గడువు ఉంది. గతంలో యుడైస్ ప్లస్ సమాచార సేకరణ అంతా మ్యాన్యువల్‌గా జరిగేది. మూడేళ్లుగా ఆన్‌లైన్‌లోనే సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. పాఠశాల కేంద్రంగా సమాచారాన్ని హెచ్‌ఎంలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఈ సమాచారం నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతుంది.

పూర్తిస్థాయి సమాచారంతో నమోదు



పాఠశాలల హెచ్‌ఎంలు యుడైజ్‌లో పూర్తిస్థాయి సమాచారం పొందుపర్చాలి. ప్రత్యేకావసరాలు గల చిన్నారుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి. క్షేత్రస్థాయిలో ఇచ్చిన సమాచారమే పాఠశాల అభివృద్ధికి కీలకంగా మారుతుంది. మండలంలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే యుడైజ్ ప్లస్‌లో నమోదు చేశాం.

– అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు

జగనన్న పాలనలో సంక్షేమ రాజ్యం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): పేదలందరూ అభివృద్ధి సాధించేందుకు, వారి అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 37వ వార్డు నందమూరి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ సంజీవ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ యూనుస్‌తో కలిసి నిర్వహించారు. ముందుగా స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా స్థిరత్వం సాధించేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వారి జీవన విధానంలో మార్పులు తెచ్చారన్నారు. అలాగే పట్టణంలో ఎన్నడూ, ఎవ్వరూ చేయలేనంతగా అభివృద్ధి చేస్తే టీడీపీ నాయకులకు మాత్రం అభివృద్ధి కనపడటం లేదన్నారు. ప్రజలను మభ్యపెడుతూ దుష్ప్రచారాలకు తెరలేపి సంక్షేమ రాజ్యంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు, వారి మాటలు నమ్మొద్దని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, పార్టీ పట్టణ మూడవ అధ్యక్షుడు జాకీర్ హుసేన్, సాంస్కృతిక జిల్లా అధ్యక్షుడు దివి రమణ, ఆటోనగర్ ప్రెసిడెంట్ జాకీర్, నంద్యాల మండల సచివాలయాల కన్వీనర్ బసవేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల(సిటీ): స్థానిక 36వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డి ఆధ్వర్యంలో 631 మందిలబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన ఆరోగ్యశ్రీకార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు జగనన్న పెంచి పేదల ఆరోగ్యానికి మరింత దీమానిచ్చారన్నారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు యశ్వంత్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి భూమి పూజ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శివాలయం, బ్రాహ్మణ అపరకర్మల భవనం వద్ద బుధవారం గోశాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సతీమణి శిల్పానాగినిరెడ్డి హాజరై భూమి పూజ చేశారు. శివాలయం గౌరవాధ్యక్షుడు, న్యాయవాది దుర్గాప్రసాద్, డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు, మురళీకృష్ణ, సుదీర్, నాగేంద్రశర్మ, రఘు, సుదీంద్రాచార్యులు పాల్గొన్నారు.

ఈవీఎంల నిర్వహణపై శిక్షణ

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ రవికుమార్ ఈవీఎంల నిర్వహణపై బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటరు నివేదికను పారదర్శకంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా తయారు చేయాలని సూచించారు. కొత్త ఓటర్లు ఉంటే వారి నుంచిది ఫారం-6 ద్వారా దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ తులసికృష్ణ, ఆర్‌ఐ సత్తార్ ఉన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు ఏర్పాట్లు చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను సూచించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో టీమ్ ఫార్మేషన్ త్వరితగతిన పూర్తి చేసి, పోటీలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే క్రీడా సామగ్రి అన్ని మండలాలలోని సచివాలయాలకు చేరవేశామన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు మైదానాలను సిద్ధం చేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు.

ఉయ్యాలవాడ: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అర్హత చూపకుండా ఆధ్యాత్మకంగా పనిచేసి క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్న క్రీడా పోటీలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో 2,094 మంది క్రీడాకారులు రిజిస్టర్ చేయించుకున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు గుర్తించాలని తెలిపారు. ఎంఈఓ బీ రత్నాలరెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చాగలమర్రి: ఆడుదాం-ఆంధ్ర పోటీల నిర్వహణకు అవసరమైన వసతులు, మైదానాలు, కోర్టులు తదితర వాటిని ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ మహబూబ్ దౌలా సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులతో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 3,802 మంది పేర్లను నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు.

రుద్రవరం: క్రీడాకారుల వారీగా ప్రతి క్రీడకు రెండు టీంలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏఓ వరలక్ష్మి, ఎంఈఓ శ్రీలక్ష్మి ఉన్నారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

నంద్యాల(న్యూటౌన్): ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని రెవరెండ్ ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్ద చర్చి)లో బుధవారం రాత్రి క్యాండిల్ లైట్ సర్వీసును పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ రెవరెండ్ జోసెఫ్‌బాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు సీఎస్‌ఐ పాస్టర్ రెవరెండ్ ప్రసన్నకుమార్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీస్తు మార్గాన్ని అనుసరించాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సెక్రెటరీ ప్రభుదాసు, స్టీఫెన్ పాల్గొన్నారు.

విలువలు పెంపొందించడానికే బాలోత్సవం

నంద్యాల (సిటీ): పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం, వారిలో సామాజిక స్పృహను కల్పించడం కోసం నంది బాలోత్సవాన్ని నంద్యాల పట్టణంలో నిర్వహించనుండటం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డి అన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో జరుగనున్న బాలోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్‌ను బాలోత్సవ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఇందుకు సంబంధించిన లోగోను కమిషనర్ ఆవిష్కరించారు.


విద్యుత్ పొదుపు సామాజిక బాధ్యత

నంద్యాల(అర్బన్): విద్యుత్ పొదుపును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని నంద్యాల విద్యుత్ శాఖ డీఈ ఏఈ రామయ్య కోరారు. స్థానిక టెక్కె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు.

కత్తితో బెదిరించి చైన్ దోపిడీ

బొమ్మలసత్రం: ఇంటి ముందు వాకింగ్ చేస్తున్న 65 ఏళ్ల వృద్ధురాలిని గుర్తుతెలియని దుండగుడు కత్తితో బెదిరించి దోపిడీకి పాల్పడ్డాడు. బాధితురాలు సుబ్బరత్నమ్మ తెలిపిన వివరాల మేరకు.. నేషనల్ సీడ్స్ ఎదురుగా ఉన్న అశోక్‌నగర్‌లో ఆమె నివాసముంటుంది. బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని దుండగుడు స్కూటీపై వచ్చి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు తాళి చైన్ ఇవ్వాలని కత్తితో బెదిరించడంతో ఆమె భయపడి చైన్ అందజేసింది. త్రీటౌన్ పోలీసులు దుండగుడి కోసం గాలిస్తున్నారు.

నేడు ప్రారంభోత్సవం



చెన్నూరుకు వేసిన రోడ్డు

శిరివెళ్ల: చెన్నూరులో అభివృద్ధి పనులకు ఈ నెల 21వ తేదీన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ప్రారంభోత్సవం చేస్తారని అధికారులు బుధవారం తెలిపారు. రూ.90 లక్షలతో దీబగుంట్ల– బోయలకుంట్ల క్రాస్ రోడ్డు నుంచి చెన్నూరు మీదుగా ఇసుకపల్లె వరకు వేసిన బీటీ రోడ్డు, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించనున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రుద్రవరం: మండలంలో గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నారని ప్రాజెక్టు ఏఈ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ కోటయ్య బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని భాస్కర నందీశ్వర స్వామి ఆలయం నుంచి అప్పనపల్లె, చందలూరు, పెద్దకంబలూరు వరకు పెద్ద కంబలూరు నుంచి సీఎం రోడ్డు మెట్ట వరకు వేసిన తారు రోడ్డును ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

నైపుణ్యాన్ని ఉపాధిగా మార్చుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు నైపుణ్యాన్ని ఉపాధిగా మార్చుకొని ప్రయోజనం పొందాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. బుధవారం కళాశాలలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగంలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు సర్టిఫికెట్ కోర్సు, ట్యూబుల్ హౌటింగ్ అండ్ ఎలక్ట్రికల్ అప్లియెన్సెస్ గత నెల నాల్గవ తేదీ నిర్వహించాం. ఈ కోర్సుల్లో 33 మంది విద్యార్థులు పాల్గొని విద్యుత్ ఉపకరణాల్లో వచ్చే సమస్యలను పరిష్కరించడంలో శిక్షణ పొందారు.